వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, సెప్టెంబర్ 29, 2026

పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణే ప్రధాన లక్ష్యం

- ఐపీఎస్ అధికారిణి డా.టి.కె శ్రీదేవి
- వార్డు అధికారులకు సాధ్యమైనంత మేలు
- హైదరాబాద్‌లో మున్సిపల్ సానిటేషన్‌పై మూడు రోజుల శిక్షణ
- 40 మున్సిపాలిటీల అధికారులకు అవగాహన



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో పారిశుధ్య యాజమా, ఘన వ్యర్థాల నిర్వహణ తీరును మెరుగుపరిచేందుకు మున్సిపల్ పరిపాలనా శాఖ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 1 వరకు మూడు రోజుల పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని 'ఆర్‌సియుఈఎస్' కేంద్రంలో ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహించబడుతోంది. రాష్ట్రంలోని 40 మున్సిపాలిటీలకు చెందిన వార్డు ఆఫీసర్లకు ఈ రెండో విడత శిక్షణ ఇస్తున్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి మార్గదర్శకత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారుల సాంకేతిక, పరిపాలనా సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారించారు. ఏప్రిల్ 1, 2026 నుండి అమల్లోకి వచ్చిన నూతన 'ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026'తో పాటు 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0' లక్ష్యాలపై అధికారులకు ప్రాక్టికల్ ప్రదర్శనలు, ఫీల్డ్ వర్క్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. చెత్త వర్గీకరణ, సేకరణ, రూట్ ప్లానింగ్, ప్రాసెసింగ్, రిసోర్స్ రికవరీలతో పాటు పారిశుధ్య కార్మికుల భద్రత, గౌరవాన్ని పెంచే 'నమస్తే' పథకం,జీపీఎస్ అధారిత పర్యవేక్షణ వంటి డిజిటల్ సాధనాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ.. పట్టణాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ మరియు జీవన ప్రమాణాలు పెంచడంలో పారిశుధ్య వ్యవస్థ కీలకమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే వార్డు ఆఫీసర్లు ఈ శిక్షణ ద్వారా తమ తమ వార్డులకు ప్రత్యేకంగా 'వార్డు స్థాయి పారిశుధ్య అభివృద్ధి ప్రణాళికలు' రూపొందిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని ఓఆర్ఆర్ వెలుపల ఉన్న 132 మున్సిపాలిటీలలో పని చేస్తున్న వార్డు అధికారులందరికీ దశలవారీగా ఈ శిక్షణ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్‌సీయూఈఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగేష్, ఆర్డీఎమ్ఏ జె.శ్రీనివాసరావు, ఎన్ఐయుఎమ్ డైరెక్టర్ వి.వేణుగోపాల్ పాల్గొన్నారు.



'అభయ హాస్పిటల్' ఆధ్వర్యంలో వైద్య శిబిరం

- 200 మందికి వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



నర్మెట్ట, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ఇటీవల కాలంలో గ్రామంలో విస్తరిస్తున్న వైరల్ జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్న ప్రజల సౌకర్యార్థం నర్మెట్ట మండలం అమ్మాపురంలో వైద్యం కృష్ణమూర్తి స్మారకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యం రాజగోపాల్ తెలిపారు. హాస్పిటళ్లకు వెళ్లలేని వృద్ధులు, వితంతువులు, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా తన తండ్రి కీ.శే.వైద్యం కృష్ణమూర్తి స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం అమ్మాపురంలో హనుమకొండ కాకాజీ కాలనీలోని 'ర్యాపిడ్ డయాగ్నోస్టిక్స్', 'అభయ హాస్పిటల్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ క్యాంపులో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వైద్యం గౌతమ్, జనరల్ సర్జన్ డాక్టర్ వైష్ణవి మస్నా, గైనకాలజిస్ట్ డాక్టర్ డొంక భార్గవిల బృందం ఉచిత వైద్య సేవలు అందించింది. సుమారు 200 మంది గ్రామస్తులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రూ. 40,000 విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరం నిర్వహణకు సహకరించిన గ్రామ సర్పంచ్ బొలగాని రేఖ బాపిరాజు, ఉపసర్పంచ్ ఇర్రి కృష్ణారెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు బోగ అంజయ్య, కక్కెర్ల వెంకటేశ్వర్లు, బొలగాని బిక్షపతి, మోహన్ రెడ్డిలతో పాటు పోతారం, పిట్టలగూడెం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి వైద్యం రాజగోపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



డాక్టర్ కూరపాటి మధుకు ఘన సన్మానం

కాశిబుగ్గ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి మధును కాశీబుగ్గకు చెందిన జై సీతారాం పరపతి సంఘం ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సమాజంలో గుండె ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తూ, ఎంతోమంది బాధితులకు వైద్యసేవలు అందిస్తున్న ఆయన సేవలను కొనియాడుతూ జై సీతారాం పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రవి డాక్టర్ మధును శాలువా, పూలమాలలతో గౌరవించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగా సేవా సంస్థ అధ్యక్షులు కూరపాటి సుదర్శన్ తో పాటు వంగరి రవి పాల్గొన్నారు.



శ్రీ ముక్తేశ్వర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రేవెల్లి రాకేష్

మహాదేవపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ ముక్తేశ్వర ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రేవెల్లి రాకేష్, ఉపాధ్యక్షుడిగా కొండ్ర తిరుపతి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రేవెల్లి రాకేష్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, పాత్రికేయుల ఐక్యతను కాపాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానని తెలిపారు. ఉపాధ్యక్షుడు కొండ్ర తిరుపతి గౌడ్ మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి అందరినీ కలుపుకుని ముందుకెళ్తానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యుల్లో అధ్యక్షుడిగా రేవెల్లి రాకేష్, ఉపాధ్యక్షుడు కొండ్ర తిరుపతి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మేకల మహేష్, సంయుక్త కార్యదర్శులుగా బటికెల మహేందర్, రేవెల్లి రాజబాపు, కోశాధికారిగా రేవెల్లి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా నాగునూరి శేఖర్, తాళ్లపల్లి రాజశేఖర్, దుగ్యాల రామ్, గాడిచర్ల కిషన్, కొండగొర్ల సంతోష్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి పలువురు స్థానిక నాయకులు, పాత్రికేయులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

- హైదరాబాద్ డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్
- వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తతగా ఉండాలి
- రోజువారీ ఎన్‌సీడీ సర్వే, స్క్రీనింగ్ నిర్వహించాలి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రభుత్వ దవాఖానాలకు వచ్చే రోగులకు అత్యుత్తమ, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మరియు సిబ్బంది అంతా విధిగా సమయపాలన పాటించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం ఆయన కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని ఇసామియా బజార్, సుల్తాన్ బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు కంటోన్మెంట్ క్లస్టర్ పరిధిలోని బాలమురాయ్ యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని హాజరు రిజిస్టర్లు, రోగుల నమోదు, ల్యాబొరేటరీ సేవలు, రికార్డులు, మందుల లభ్యత, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు బస్తీ దవాఖానాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులను సరిపడా నిల్వ ఉంచాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి మందుల కొరత రాకుండా చూడాలి. నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో-అప్‌లను ప్రతిరోజూ నిర్వహిస్తూ, ఆ సమాచారాన్ని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఇంటింటి సర్వేలు నిర్వహించి, ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలి. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకోవాలి. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సత్వరమే పూర్తి చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.